మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
30-3-2025






# నేటినుండి భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఏప్రిల్ 6 న సీతారాముల కళ్యాణం
- 7 న పట్టాభిషేకం
- లక్ష మందికిపైగా భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు

09



10

## కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో

# పాల్వంచ మనుగడకి ఇబ్బంది ఉండదు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు
- కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పరుగులు
- మునుపెన్నడు జరగని రీతిలో కొత్తగూడెం అభివృద్ధి చెందుతుంది
- విద్యా, వైద్య, వ్యవసాయం, టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాం



09

# ఖమ్మం అభివృద్ధికి కొత్త దారులు

## భద్రాచలానికి నూతన రంగులద్దుతున్న ప్రభుత్వం

- రైతు సంక్షేమానికి మరింత బలమైన అడుగులు
- ఖమ్మం రింగ్ రోడ్ - ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- భద్రాద్రి ఆలయ అభివృద్ధికి కీలక నిధుల కేటాయింపు
- ఉగాది నాడు ఖమ్మం అభివృద్ధికి పలు శుభవార్తలు
- ఖమ్మం జిల్లాలో వివిధ అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల

ఖమ్మం జిల్లా అభివృద్ధికి కీలకమైన పలు నిర్ణయాలు, ప్రాజెక్టులు, పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ముఖ్యంగా, ఆయిల్ పామ్ రైతులకు బలమైన మద్దతుగా ఖమ్మం జిల్లాలో కొత్త ఫ్యాక్టరీ శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటించారు. అలాగే, భద్రాద్రి ఆలయ అభివృద్ధికి 34 కోట్ల నిధులు మంజూరు చేయడం, ఖమ్మం రింగ్ రోడ్ రూపకల్పన, జాతీయ రహదారుల నిర్మాణానికి పురోగతి, కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయానికి అనుమతి వంటి కీలక అంశాలు ఖమ్మం జిల్లా భవిష్యత్తును వెలుగులు నింపనున్నాయి.

ఖమ్మం - మహా

02
FOLLOW: @ANNTELUGU
30-3-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ముఖ్యమంత్రి వస్తున్నారు

## శ్రీరామ నవమి పనులు పరిశీలించిన కలెక్టర్



**మహా భద్రాచలం:** భద్రాద్రిలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం పట్టాభిషేకంనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నారని, ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం నాడు భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం జరిగే మిథిలా స్టేడియం లో సీ.ఎంతో పాటు వివిఐపీలు, వీఐపీలు సౌకర్యంగా కూర్చుని కళ్యాణం తిలకించడానికి జరుగు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళ్యాణం తిలకించడానికి 250 మంది వివిఐపీలు, 500 మంది వీఐపీలు మరియు సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లు, హైకోర్టు, సుప్రీం కోర్ట్ జడ్జిలు వారి కుటుంబాలతో వచ్చే అవకాశం ఉన్నందున వారి హోదాలకు తగ్గట్టు కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలని అన్నారు. అలాగే భక్తులకు కూడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ చల్లని గాలి వీచే విధంగా స్నో ఫాగ్ ఏర్పాటు చేస్తున్నామని, కళ్యాణం తిలకించడానికి వచ్చే భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా చూసి దర్శనము చేసుకొని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరాలని, కళ్యాణం కాగానే భక్తులు స్వామివారి తలంబ్రాల కోసం భక్తులు ఎవరు ఎగబడవద్దని, అందరికీ తలంబ్రాలు, ప్రసాదాలు దొరికే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులందరికీ మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు గ్యాలరీలోనే అందించడానికి సిబ్బందిని నియమించామని, భక్తులందరూ అధికారులం దరికీ సహకారం అందించి స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు చూపరులకు కనువిందు చేసేలా మ్యూజియంను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సారధ్యంలో ముస్తాబు చేస్తున్నారని, మ్యూజియం సీఎం చేత ప్రారంభం చేయిస్తున్నామని, కళ్యాణం తిలకించడానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా గిరిజన సాంప్రదాయాలకు సంబంధించిన మ్యూజియంను సందర్శించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రవీందర్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ బ్రహ్మయ్య, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏ ఈ రవి, తాసిల్దార్ శ్రీనివాస్, ఏవో గన్యా, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

**బోనకల్, మహా:** మండల పరిధిలోని రావినూతల గ్రామంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కిలారు సురేష్, గ్రామ మండల శాఖల ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలు మొత్తం అమలు చేయాలంటూ శనివారం రావినూతల పంచాయతీ కార్యాలయం ఎదుట నాయకులు,కార్యకర్తలు తమ నిరసన తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని, నూతన రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇండ్లు,ఆత్మీయ భరోసా,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు 2500 వంటి పథకాలకు నిజమైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## చలివేంద్రం ఏర్పాటు

**తల్లాడ, మార్చి 29( మహా ):** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రజలెవరు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు సెక్రటరీ తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ వెంకటేశ్వర్ల కి అన్నారుగూడెం గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లాలోనే నన్ను డిక్టేట్ చేయగల వ్యక్తి కృష్ణమూర్తి ఒక్కరే..

**తల్లాడ, మహా న్యూస్:** రాష్ట్రంలో కానీ జిల్లాలో కానీ నన్నెవరైనా దబాయించి డిక్టేట్ చేయగల వ్యక్తి కృష్ణమూర్తి ఒక్కరేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రాత్రి ఖమ్మం జిల్లా తల్లాడ మండలం లోని బిల్లుపాడు గ్రామంలో స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుత్తా వెంకటేశ్వరరావు అ ధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో కృష్ణమూర్తి లాంటి వ్యక్తులు ఉండబట్టే అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేశారు. కృష్ణమూర్తి మాట, మంచితనం మనందరికీ తెలుసని, ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై అవగాహన కార్యక్రమం

**బోనకల్,మహా:** భారత ప్రధాని మోడీ యొక్క నినాదంతో ఒకే దేశం ఒకే ఎలక్షన్ పై అవగాహన సదస్సును మండల సీనియర్ నాయకులు మందపల్లి పాపారావు నివాసం వద్దమండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుకు మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా శాలువతో సత్కరించారు,ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే విధానం ఎంతో అవసరమని భారతదేశంలో 1951-52 నుండి 1967 వరకు రాష్ట్రాల శాసనసభలకు మరియు ప్రజాసభకు ఎన్నికలు ఒకేసారి జరిగాయని గుర్తు చేశారు, ప్రస్తుతం ఈ చక్రం చెడిపోయిందని అన్నారు,ప్రతి సంవత్సరం కొన్నిసార్లు ఒక రాష్ట్రంలో సంవత్సరం లోపల కూడా వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్నాయని దీని ఫలితంగా భారీగా ప్రభుత్వ ఖర్చులు,భద్రతా దళాలు ఎన్నికలు నిమగ్నమైన ఎన్నికల అధికారులను వారి ప్రాథమిక విధుల నుండి చాలాకాలం పాటు మళ్ళించటం మోడల్ ప్రవర్తన నియమాలను వర్తింపజేయడం వల్ల అభివృద్ధి పనులలో అంతరాయం మొదలైనవి సంభవిస్తున్నాయని అన్నారు,కావున దేశ ప్రజల సొమ్మును పరిరక్షించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వన్నేషన్ వన్ ఎలక్షన్ విధానాన్ని అమలులోకి తేవాలని నిర్ణయించారని దీని వలన సమయం డబ్బు ఆదా అవుతుందన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చింతకాని,మార్చి29(మహా):** చింతకాని మండల కేంద్రంనందు సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. చింతకాని గ్రామానికి చెందిన బి రామరాజుకు 20000 రూపాయలు, రేపల్లెవాడ గ్రామానికి చెందిన మడుపల్లి భాస్కర్ రావు 17,500 రూపాయల చెక్కును చిన్నమండవ గ్రామానికి చెందిన ఆత్మకూరు అనీషా కు 35 వేల రూపాయలు చెక్కునువందనం గ్రామానికి చెందిన ఎస్ శంకరయ్యకు 25 వేల రూపాయలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర రావుఅందజేసినారు.

## ముగ్గుల పోటీలు



**చర్ల,మహా:** మండల కేంద్రం లో గల రాహుల్ విజ్ఞాన విద్యాలయం హాస్టల్ ప్రాంగణంలో విశ్వావసు నామా సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకొని నగార ఉగాది సంబరాలు నిర్వహిస్తుంది ఇందులో భాగంగా శనివారం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించడం జరిగింది, ఈ ముగ్గుల పోటీలో సుమారు 30 మంది మహిళలు పాల్గొని వారి రంగవల్లిలను 60 నిమిషాల వ్యవధిలో అద్భుతమైన రంగులతో రూపుదిద్దారు. ప్రథమ ద్వితీయ తృతీయ ప్రత్యేక బహుమతి కి సంబంధించిన బహుమతులను ఆదివారం గ్రంథాలయం ప్రాంగణం సురేష్ ఓపెన్ ఆర్ట్స్ థియేటర్ లో సాయంత్రం జరిగే ఉగాది సంబరాలు నగార సాంస్కృతిక సేవా సంస్థ వారు నిర్వహించే కార్యక్రమాలను ఈ బహుమతులను ప్రధానం చేస్తారు.

## గ్యాస్ పైపు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

**కామేపల్లి మార్చ్ 29(మహా):** పంట పొలాలు గ్యాస్ పైప్ లైన్లు ఉన్నటువంటి రైతులు తగు జాగ్రత్త పాటించాలని గ్యాస్ ప్రమాదాల వల్ల అవగాహన కలిగి ఉండాలని ఆ సంస్థ జి ఐ టి ల్ ఏజీఎం దీపక్ రాయ్ అన్నారు శనివారం మండల పరిధిలో పాల్గొని కామేపల్లి తాళ్లగూడెం గ్రామంలో గ్యాస్ లైన్ కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పించారు

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కామేపల్లి, మార్చి 29(మహా):** తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా శనివారం తాళ్ళ గూడెం గ్రామంలో నిర్వహించారు.తోలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈసందర్భంగా టిడిపి జిల్లా నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ మాట్లాడుతూ. స్వర్గీయ ఎన్టీఆర్ తెలంగాణ గడ్డ మీద పార్టీ ని స్థాపించి పెద,బడుగు బలహీన వర్గాలకు 2కేజీల బియ్యం,ఇండ్లు,జనతావస్త్రాలు ,స్త్రీ లకు ఆస్తిలో సమాన హక్కు,ప్రజలకు అందుబాటులో మండల వ్యవస్థ ఎర్పాటు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**కామేపల్లి, మార్చి 29(మహా):** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఇల్లెందు నియోజ కవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య , తెలంగాణ అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి లు అన్నారు. మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామంలోని కోట మైసమ్మ తల్లి దేవాలయంలో ఉగాది ఉత్సవాలను శనివారం మహా ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తిభావం చాటుకున్నారు.

## ఆశ్రయ సేవా సొసైటీ సేవలు అభినందనీయం

**బోనకల్, మహా:** మండల తహశీల్దార్ కార్యాలయం లో ఆశ్రయ సేవా సొసైటీ క్యాలెండర్ ను స్థానిక తహశీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాల్లో పయనించ కుండా సేవా కార్యక్రమాల్లో పనిచేయడం చాలా గొప్ప విషయం అని, మండల పరిధితోపాటు,జిల్లా స్థాయిలో సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు.

మహా పత్రిక
ANN తెలుగు




# పేదలకు ముందుగా సంక్షేమ పథకాలు చేరాలి

## త్వరలోనే మంచినీటి సరఫరా పథకానికి మరో 220 కోట్లు మంజూరు

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ఖమ్మం, మార్చి -29, మహా:** ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ముందుగా పేదలకు చేరాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శనివారం మంత్రి, ఖమ్మం కార్పొరేషన్, రఘునాథపాలెం మండలంలో పర్యటించి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ శ్రీరాం హిల్స్ లో టి.యు.ఎఫ్.ఐ.డి. సి. నిధులు కోటి రూపాయలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రఘునాథ పాలెం మండలం వి.వి. పాలెంలో వివి పాలెం ఎన్.ఎస్.పి. కెనాల్ నుండి ఇల్లందు – వైరా బైపాస్ రోడ్డు వరకు సి.ఆర్.ఆర్. నిధులు 2 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, వివి పాలెం గ్రామం ఎస్.సి. కాలనీ నందు సి.ఆర్.ఆర్. నిధులు 60 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ప్రజల ఆశీర్వాదంతో అవకాశం మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగు తుందని అన్నారు. అభివృద్ధి పనులలో ప్రజల సహకారం అవసరమని, ఐఏఎస్ అధికారి మున్సిపల్ కమీషనర్ గా ఉన్నారని, ఆయనతో మనం మరిన్ని కార్యక్రమాలు చేయించుకోవాలని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో మంచినీటి సరఫరా పథకానికి మరో 220 కోట్లను ప్రభుత్వం త్వరలోనే మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజి వ్యవస్థ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తూ నివేదిక పంపామని అన్నారు. ఖమ్మం నగరం చుట్టు చేపట్టిన జాతీయ రహదారులు పూర్తి చేసుకుంటే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని మంత్రి తెలిపారు. అర్హులకు భూ పట్టాలను ఆర్డీఓతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించు కోవాలని అన్నారు. ఎన్టీఆర్ హాయంలో ఎత్తిపోతల పథకం మంజూరు చేయించామని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే అభివృద్ధి పనులను మండల అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మొదటి దశలో పేదలను ఎంపిక చేసి ఇండ్లు, ఇంటి పట్టాలు అందించాలని అన్నారు. ప్రతి సంవత్సరం ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, దశల వారీగా అర్హులందరికీ అందిస్తామని అన్నారు. శ్రీరామ్ హిల్స్ లో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ప్రధాన రోడ్ల ప్రక్కన ఫుట్ పాత్ అభివృద్ధి కోసం 10 కోట్ల నిధులు మంజూరు చేశామని, వారం రోజులలో ఈ పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు హరినాథ బాబు, యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్లాక్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు

సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్, ఇండోర్ టేబుల్ టెన్నిస్, బ్యాడ్మిం టన్ స్టేడీయం ఏర్పాటుకు ప్రణాళికలు రూపాం దించామన్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డు సర్కిల్‌లో నగరానికి ఆకర్షణీయంగా క్లాక్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు పారిశుధ్య నిర్వహణ, మెరు గైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలు కూడా సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ కార్పొరేషన్ కు సహకరిం చాలని, పారిశుధ్య నిర్వహణలో తమ వంతు పాత్ర పోషించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రానైట్ సబ్సిడీ రూ. 19 కోట్ల విడుదలకు సంబంధిం చిప్రభుత్వ ఉత్తర్వులు మంత్రి చేతులమీదుగా గ్రానైట్ వ్యాపారులకు అందించారు.

## మే డే పురస్కారాల కొరకు నామినేషన్ ఫారాలను సమర్పించాలి

**ఖమ్మం, మార్చి -29, మహా:** మే డే సందర్భంగా అందించే శ్రమ శక్తి, పారిశ్రామిక ఉత్తమ యాజమాన్య పురస్కారాల కొరకు ఏప్రిల్ 10 వ తేదీలోగా నామినేషన్ ఫారాలను సమర్పించాలని ఉప కార్మిక కమిషనర్ కే. విజయభాస్కర్ రెడ్డి శనివారం తెలిపారు. కార్మికుల కృషిని గౌరవించడం, సుహృద్భావ పారిశ్రామిక సంబంధాలను ప్రోత్సహించడం కోసం కార్మిక శాఖ ద్వారా ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మే డే ఉత్సవం ఈ ఏడాది కూడా 2025 మే 1వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు, ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందించిన కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులకు ప్రతిష్టాత్మక శ్రమ శక్తి పురస్కారాలు ప్రదానం చేయబడతాయని, ట్రేడ్ యూనియన్లతో, కార్మికులతో సఖ్యతను పరిరక్షించి, రాష్ట్ర ప్రగతికి విశేషంగా సహకరించిన చిన్న, మధ్య, పెద్ద తరహా పారిశ్రామిక యాజమాన్యాలకు ఉత్తమ యాజమాన్య పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు, యాజమాన్యాలు ఖమ్మం ఉప కార్మిక కమీషనర్ కార్యాలయం నుండి నామినేషన్ ఫారాలు పొంది, సంబంధిత పత్రాలతో కలిపి ఏప్రిల్ 10వ తేదీ లోపు తిరిగి సమర్పించాలని, నామినేషన్ ప్రక్రియ, ఇతర వివరాల కోసం ఖమ్మం ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని ఉప కార్మిక కమిషనర్ తెలిపారు.

## పామాయిల్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభం

**సత్తుపల్లి, మార్చి 29: మహా:** మారుమూల ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందాలనే దృక్పథంతో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో మండల పరిధిలోని మారుమూల ప్రాంతమైన కల్లూరుగూడెం గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీకి ఆదివారం భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సహా జిల్లా మంత్రులు హాజరవుతున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రకటనలో తెలిపారు. మంత్రుల రాకకు సంబంధించిన సభా ప్రాంగణం పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పరిశీలిస్తూ సూచనలు సలహాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, చల్లగళ్ళ నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం



**నేలకొండపల్లి - మహా:** చేతన ఫౌండేషన్ వారు సమాజానికి ఎంతో ఉపయోగపడే కార్యక్రమం చేపటా ్టరని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లిలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచిత ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో స్వార్థంతో కూడుకున్న ఆలోచనలు ఉన్నాయి. అలాంటి సమయంలో చేతన ఫౌండేషన్ వారు సొంతంగా విరాళాలు సేకరించి వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం అభినదనీయమని కొనియాడారు. ప్రతి మనిషి తన వంతు బాధ్యతగా సమాజానికి ఏం చేయాలో ఆలోచించాలని సూచించారు.

## కూసుమంచిలో పాస్టర్ల శాంతి ర్యాలీ




**కూసుమంచి, మార్చి 29, మహా:** కూసుమంచి మండల కేంద్రం లో మండలంలోని పాస్టర్లందరు కలిసి శాంతిర్యాలీ నిర్వహిం చారు. స్థానిక కూసుమంచి మండల కేంద్రంలో కూసు మంచి మండల కమిటీ సంఘ కాపరుల ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న క్రైస్తవుల సహకారముతో గత మూడు రోజుల క్రితం దుండుగులచే హత్యగా విపబడిన పగడాల ప్రవీణ్ పాస్టర్ మరణాన్ని నిరసిస్తూ శాంతియుత ర్యాలీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమములో పాలేరు నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ ఈ విధముగా దుండగులు సంఘ క్షేమము, మార్పు కొరకు అహర్నిశలు కృషి చేస్తున్న తప్పుడు మార్గంలో ప్రయాణం చేస్తున్న యువతను సరియైన మార్గములో నడిపించుట కొరకై యువతకు మంచి సలహాలు సూచనలు ఇస్తూ అనేకుల ప్రయోజనాల కొరకై జీవించుచున్న ఒక సంఘ కాపరి పగడాల ప్రవీణ్ ని అమానుషముగా హత్య చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ నుండి దైవజనులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తపరిచారు. మండలంలో పనిచేయుచున్న దైవజనులు అధ్యక్ష కార్యదర్శులు యోహాను జాన్ వెస్లీ, లూకారాజు, క్రీస్తు దాసు, కరుణ కుమారు తదితర సేవకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్‌లో నేత్రపర్వంగా తెలుగు సంవత్సరాది ఉగాది సంబురాలు



**ఖమ్మం - మహా:** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం శ్రీ విశ్వా వసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. సూర్య భగవానునికి పొంగలి నైవేద్యంగా సమర్పించి ప్రకృతి మాతకు విశేష పూజలు నిర్వహించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని పాఠశాల విద్యార్థులు తయారుచేసి అందరికీ పంచారు. ప్రకృతి రమణీయత వెల్లివిరిసేలా అరటి ఆకులు, మామిడికాయలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రకృతిలో కొత్త చిగుళ్ళు పూసి రమణీయంగా ఉండడాన్ని బట్టి ప్రతి ఒక్కరి జీవితం లో గతకాలపు కష్టనష్టాలు తొలగిపోయి కొత్త ఆశలతో నూతన శకానికి ఆవిష్కరణ జరుగుతుందన్న విషయం ప్రకృతి మనకు తెలియజేస్తున్నదని తెలిపారు. ఉగాది పచ్చడి స్వీకరించడం ద్వారా జీవితంలోని అన్ని అనుభవాలను సమానంగా స్వీకరించాలన్న భావన ప్రతి ఒక్కరిని జాగ్రుతం చేస్తున్నదని వివరించారు. పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే రోజులలో సంభవించే నూతన ప్రక్రియలను సూచిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పదో తరగతి ఆన్సర్ షీట్ల డ్యామేజ్

- పరీక్షా షీట్ల నిర్లక్ష్య రవాణా
- తడిసిన ఆన్సర్ షీట్లు
- పరీక్షాలో గందరగోళం
- ప్రభుత్వ చర్యలెప్పుడు?



**ఖమ్మం - మహా:** తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల నిర్వహణలో తీవ్ర జాప్యం, నిర్లక్ష్య ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా, ఖమ్మం జిల్లాలో పదో తరగతి ఆన్సర్ షీట్లు సరైన భద్రత లేకుండా తరలించడంతో అవి దెబ్బతి న్నాయి. పోస్టల్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఆన్సర్ షీట్లు చిరిగిపోయి, కొన్ని తడిసి పోయాయి. ఈ ఘటన విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### పోస్టల్ శాఖ నిర్లక్ష్యం విద్యార్థులకు అన్యాయం

ప్రతి పరీక్ష అనంతరం ఆన్సర్ షీట్లు రాష్ట్ర విద్యా మండలికి చేరే విధంగా పోస్టల్ శాఖ ద్వారా రవాణా చేస్తారు. అయితే, ఈసారి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, పరీక్షా కేంద్రాల నుంచి భద్రతా చర్యలు పాటించకుండా ఆన్సర్ షీట్లు తరలించబడ్డాయి. చిరిగిన బస్తాలు, బయటపడిన పత్రాలు, తడిసిపోయిన సమాధానాలు %-% ఇవన్నీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. దీనివల్ల మార్కుల లెక్కింపులో పొరపాట్లు జరగవచ్చని విద్యాశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### విద్యార్థుల్లో భయాందోళనలు తల్లిదండ్రుల ఆగ్రహం

పరీక్ష రాసి మంచి మార్కులు వస్తాయని ఆశించిన విద్యార్థులకు ఈ ఘటన తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగించింది. "మేము ఎంత కష్టపడ్డా, ఇలా జవాబు పత్రాలు దెబ్బతింటే మా శ్రమ వృధా అవుతుందా?" అని విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు విద్యాశాఖను ప్రశ్నిస్తూ, "ఈ బాధ్యతారాహిత్యానికి ఎవరు బాధ్యులు?" అంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సరైన విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### పరీక్షా విధానంలో సిస్టమేటిక్ లోపాలు

### సాంకేతికతతో పరీక్షా విధానాన్ని అభివృద్ధి చేయాలి

ప్రతి సంవత్సరం ఇలాంటి నిర్లక్ష్య ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. పరీక్షా విధానంలో ఆధునిక మార్పులు తీసుకురావడం తప్పని సరి. ఆన్సర్ షీట్లు రవాణా ప్రక్రియను ఆధుని కీకరించి, డిజిటల్ అసెస్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడం అవసరం. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణమే సంస్కరణలు చేపట్టాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉంటాయి.

### భవిష్యత్తులో సమస్యల నివారణ

ఇది ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే ఇలాం టి ఘటనలు మళ్లీ జరగకుండా కఠినమైన నిబంధనలు తీసుకు రావాలి. ఈ సంఘటనలను పునరా వృతం కాకుండా పరీక్షా విధానంలో సరైన మార్పులు తీసుకురావాలి. విద్యార్థుల కృషి వృధా కాకుండా, ప్రభుత్వం వెంటనే సమర్థమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇలాంటి ఘటనలు ప్రతి ఏడాది పరీక్షల సమయంలో వెలుగు చూస్తున్నా, ఇంకా మార్పులు రావడం లేదు. పరీక్షా విధానం లో లోపాలు, ఆన్సర్ షీట్ల రవాణా నిబంధనలు సరైన విధంగా పాటించక పోవడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయి. అధికార యంత్రాంగం తన నిర్లక్ష్య ధోరణిని వదిలి, పరీక్షా విధానంలో ఆధునీ కరణ చేపట్టాలి. విద్యాశాఖ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

### ఆర్టీసీ బస్సులో ఫిజికల్ సైన్స్ ఆన్సర్ పేపర్లు డ్యామేజ్ కలకలం

ఇక, మరో ఘటనలో ఖమ్మం జిల్లాలోని ఆర్టీ బస్సులో పదో తరగతి ఫిజికల్ సైన్స్ ఆన్సర్ షీట్లు తడిసిపోయాయి. సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ ఘటన చోటుచేసుకుంది. తడిసిపోయిన పేపర్లను తిరిగి మామూలుగా మార్చడం అసాధ్యమని, దీంతో విద్యార్థులకు అన్యా యం జరుగుతుందని విద్యా నిపుణులు అంటున్నారు.

### విద్యాశాఖ స్పందన అవసరం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు

ఈ ఘటనలపై విద్యాశాఖ వెంటనే స్పందించి, పరీక్షా విధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తడిసిన ఆన్సర్ షీట్లు రీ-వాల్యుయేషన్ చేయాల్సిన అవసరం ఉందా? అదనపు కాపీలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలి. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడం, ఆన్సర్ షీట్ల రవాణాకు అధునాతన సాంకేతికతను ఉపయోగించడం వంటి చర్యలు చేపట్టాలి.

## శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న

# నెల్లూరు కోటేశ్వరావు



**ఎర్రుపాలెం, మహా :** ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు జిల్లా అధ్యక్షులు ఎన్నికైన తర్వాత మొదటిసారిగా మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని, ఎర్రుపాలెం మండల కేంద్రంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పుప్పాల బుల్లయ్య ఇంటి వద్ద భారతదేశ ప్రధాని మోడీ యొక్క నినాదంతో ఒకే దేశం ఒకే ఎన్నిక మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరవు మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నిక అనే విధానం ద్వారా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని ప్రభుత్వ ప్రతిపాదన. దీని ద్వారా ఎన్నికల నిర్వహణ ఖర్చు తగ్గించడం, పరిపాలన సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి ఏడాది ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటంతో, మానవ వనరులు, పోలీస్ దళాలు వృధాగా వినియోగించబడతాయి. ఒకేసారి ఎన్నికలు జరిగితే, ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు. తరచూ ఎన్నికలు జరిగితే, ప్రభుత్వ అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై పాలనా పనులు దెబ్బతింటాయి. ఒకేసారి ఎన్నికలు జరిగితే, పాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుంది. ప్రస్తుత విధానంలో ఎన్నికల ప్రచారం, విధానాలు ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం రాజకీయ అస్థిరతను తగ్గించగలదు. ఒకేసారి ఎన్నికలు జరిగితే, రాష్ట్ర ప్రభుత్వాల స్వయంప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారవచ్చు. ఒకే దేశం ఒకే ఎన్నిక ఒక మంచి ఆలోచన అయినప్పటికీ, దీన్ని అమలు చేయడానికి అనేక చట్టపరమైన, రాజకీయ, పరిపాలనా సవాళ్లు ఎదురవుతాయి. ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా, సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. సమగ్రతతో ప్రగతి ఒకే ఎన్నికతో భారతాభివృద్ధి జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర కన్వీనర్ ఏలూరు నాగేశ్వరావు, సిలివేరు సాంబశివరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రామిశెట్టి నాగేశ్వరరావు, ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు, మధిర పట్టణ అధ్యక్షులు సుమంత్, ఖమ్మం జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు, కత్తి రవి, గరికపాటి పురుషోత్తం, సురేష్ కన్నా రామకృష్ణ, ప్రేమ్ కుమార్, రావిరాల అచ్చారావు, పిట్ల గోపాలరావు, కృష్ణారెడ్డి, కృష్ణారావు, నర్సిరెడ్డి మొదలగున్నవారు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ జిల్లా అధికారుల సన్మానం

**ఖమ్మం - మహా:** జిల్లా విద్యుత్ శాఖ అధికారిగా మూడు సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వరంగల్ వెళ్లిన సురేందర్ ని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇనుగుర్తి శ్రీనివాసాచారి ని విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సురేందర్ సేవలను ప్రశంసించడంతో పాటు, శ్రీనివాసాచారి కి ఆత్మీయ స్వాగతం తెలిపారు. విద్యుత్ శాఖను రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఉద్యోగులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ విద్యుత్ సంఘాల నాయకులు, డివిజనల్ ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



## జై బాపు! జై భీమ్!! జై సంవిధాన్!!!



**వైరా - మహా:** వైరా నియోజకవర్గంలో ఏఐసిసి దేశవ్యాప్త పిలుపులో భాగంగా, టిపిసిసి ఆదేశాల మేరకు ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా గౌరవ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిపోతోందని, ప్రజల చైతన్యంతోనే బలమైన పాలన తీసుకురావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ సిద్ధాంతాలను అనుసరించి గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



# ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం

## ఎన్టీఆర్ ఘనతను స్మరించుకున్న నేతలు

## ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రామనాధం

**ఖమ్మం - మహా:** తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఖమ్మం పార్లమెంట్ హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరిష్ చంద్ర అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రామనాధం హాజరయ్యారు. పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం డీజే పాటలతో కూడిన ర్యాలీ నిర్వహించి, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. కార్యాలయం లో తిరిగి కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా డా. వాసిరెడ్డి రామనాధం మాట్లాడుతూ, 1982 మార్చి 29న ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ కేవలం 9 నెలల్లోనే 202 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని ప్రభుత్వం ఏర్పాటు చేయడం చరిత్రలో అపూర్వ ఘట్టమని పేర్కొన్నారు. రూ.2కే కిలో బియ్యం పథకం, పింఛన్లు, పటేల్-పట్వారి వ్యవస్థ రద్దు, మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కు కల్పించడం వంటి అనేక సంస్కరణలతో రాష్ట్ర రాజకీయాల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పార్టీ స్థాపన నుంచి ఇప్పటి వరకు 10 సార్లు ఎన్నికలు జరిగితే, అందులో 6 సార్లు టీడీపీ అధికారంలోకి రావడం గర్వించదగిన విషయమని తెలిపారు.

### రాజకీయంగా టీడీపీ దృష్టి

**ఈ వేడుకల సందర్భంగా నాయకులు, కార్యకర్తలు టీడీపీ యొక్క భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలపడి తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా అధినేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గత పాలనలో టీడీపీ సాధించిన విజయాలను ప్రజలకు చేరువ చేసే విధంగా పార్టీ ముందుకు సాగాలని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ వేడుకలు టీడీపీ నాయకత్వానికి కొత్త ఉత్సాహాన్ని అందించాయి. పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపిన ఈ కార్యక్రమం, రాబోయే రాజకీయ సమరానికి పార్టీ సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చింది.**

### కార్యకర్తల సేవలను గౌరవించిన పార్టీ

అనంతరం పార్టీ కోసం సేవలందించిన సీనియర్ నేతలను సన్మానించడం జరిగింది. అలాగే, కార్యాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, పార్టీ కార్యకర్తలందరికీ భోజన సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా సీతయ్య, మంద వెంకటనారాయణ, చుండూరు రాజేశ్వరి, మల్లెంపాటి అప్పారావు, మేకల సత్యవతి, మీగడ రామారావు, మందపల్లి రజిని, చంద్ర రవికుమార్, నల్లమల రంజిత్, అబ్దుల్ మజీద్, పాలడుగు కృష్ణప్రసాద్, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, తీగుళ్ల రమణ, మురళి, బాతరాజు కనకయ్య, గుండెపిన్ని నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్, తాడిశెట్టి స్వాతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి అడవుల్లో చెట్ల దోపిడీ

**మౌనం వహిస్తున్న అధికారులు!**

**అక్రమార్కుల చెరలో అడవి**

**పర్యావరణానికి పెనుముప్పు**



**భద్రాచలం - మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం , బూర్గంపాడు మండలాల పరిధిలోని అడవి ప్రాంతాల్లో చెట్ల నరికివేత అధికంగా జరుగుతోంది. ముఖ్యంగా ఇరవెండి బీట్ పరిధిలో ఈ విధ్వంసం మరింత తీవ్రంగా కనిపిస్తోంది. అనేక విలువైన చెట్లు నేలకొరిగిపోతున్నా, స్థానిక రెవెన్యూ అధికారులు కనీస నిఘా కూడా పెట్టకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అటవీ శాఖ అధికారులు, ముఖ్యంగా బీట్ ఆఫీసర్ ఏమి చేస్తున్నారు అనే ప్రశ్న ప్రస్తుతం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

### అక్రమార్కులకు అటవీ అధికారుల సహకారం?

ప్రభుత్వ పరిరక్షణలో ఉండాల్సిన అడవులు వ్యాపారదారుల ముఠాల చేతుల్లో చిక్కిపోతుండడం ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. అధికారుల నిర్లక్ష్యానికి తోడు, కొందరు దుండగుల అనుకూల వ్యవహారాలు మరింత ప్రశ్నార్థంగా మారాయి. ప్రజల్లో అధికారుల తీరుపై అనుమానాలు పెరుగుతున్నాయి %-% అడవి నరుకుతున్న ఈ దౌర్జన్యంపై వారికి సమాచారం లేదా? లేక దోపిడీకి సహకరిస్తున్నారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను ఇలా విధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసం? దీని వెనుక ఉన్న చేతులు ఎవరివో ప్రభుత్వం విచారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజల పోరాటం, ప్రభుత్వ నిర్లక్ష్యం

చెట్ల నరికివేత, గుట్టల నాశనం వంటి అన్యాయాలను అడ్డుకోవాలని ప్రజలు ఉద్యమిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇక్కడ అడవులను కాపాడాల్సిన అటవీ శాఖ ఎందుకు మౌనంగా ఉంది? రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడంలేదు? ఈ ప్రశ్నలకు సమాధానం లేకపోవడం, భవిష్యత్తులో మరిన్ని పెను ప్రమాదాలకు దారితీయవచ్చు. ప్రజలు ఈ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ హస్తక్షేపం అవసరమని డిమాండ్ చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ ప్రాంతాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, తప్పుదారి పట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కర్తవ్యబద్ధంగా కోరుతున్నారు. లేకుంటే, రాబోయే కాలంలో ఈ ప్రాంత అడవులు పూర్తిగా నాశనమైపోతాయని, పర్యావరణ సమస్యలు పెరిగిపోతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రజల ఆందోళనలు కదిలించి, సరైన చర్యలు తీసుకునే సమయం ఆసన్నమైంది.

### గుట్టలు కూడా మాయమవుతున్న వాస్తవం

అడవిలో కేవలం చెట్లు మాత్రమే కాదు, కొండలు, గుట్టలు సైతం నాశనం అవుతున్నాయి. అక్రమ మైనింగ్ మాఫియా ఆ ప్రదేశాల్లో తనదైన రీతిలో ఆస్తులను దోచుకుంటూ అటవీ సంపదను నేలమట్టం చేస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలించినవారు, ఈ అక్రమ మైనింగ్ వెనుక అధికారులే ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘనమైనా, దొరికిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారులు చేతులెత్తేయడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.

## ఉగాది శుభాకాంక్షలు: మాజీ ఎంపీ నామ



**ఖమ్మం - మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఉగాది పర్వదినం సందర్భంగా శనివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించేది మాత్రమే కాకుండా, నూతన ఆశలు, కొత్త లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే అద్భుతమైన శుభదినమని ఆయన పేర్కొన్నారు. ఉగాది పచ్చడి మాదిరిగా జీవితం కూడా చేదు, తీపి, కారం, వగరు, పులుపు, ఉప్పు రుచులతో కూడి ఉంటుందని, సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ విజయపథంలో ముందుకు సాగాలని ప్రజలను కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాషా గౌరవం, సంస్కృతి పరిరక్షణ, వ్యవసాయ రంగం అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత శ్రద్ధ చూపించాలని సూచించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు కొత్త సంవత్సరంలో మరింత మంచి కలుగాలని అభిలషించారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఇంటా శాంతి, సమృద్ధి, ఆనందాన్ని తెచ్చిపెట్టాలని కోరుకుంటూ, మరోసారి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**మధిర మార్చి 29 మహా:** మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దెందుకూరు గ్రామానికి చెందిన భీమనపల్లి వివేక్ అనే యువకుడుకు సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్ రావు ద్వారా 15వేల రూపాయల చెక్కును అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ ప్రజలకు వైద్య ఖర్చులు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని అన్నారు. ఈ ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్యాన్ని పేదలకు అందించే కృషి ప్రభుత్వం చేయాలని కోరారు. నేటి సమాజంలో వైద్యం సామాన్యుడికి అందని ద్రాక్షలాగా మారిపోయిందని ప్రభుత్వం యంత్రాంగం దీనిపై గట్టి సారించాలన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మండల కార్యదర్శి మంద సైదులు పార్టీ నాయకులు అనుమోలు భాస్కరరావు దెందుకూరు గ్రామ శాఖ కార్యదర్శి అల్లూరి నాగేశ్వరరావు. మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**బోనకల్, మహా :** తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కటింగ్ చేసి మిఠాయి పంచారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు భాగం రమేష్, మైనేని రవికుమార్,సాధినేని హనుమంతరావు, కరివేద పిచ్చయ్య, మరీదు బరకయ్య, తూము పురుషోత్తమరావు,వనమా హరిబాబు, మండిపూడి గోర్కే, కొమ్మినేని వెంకటేశ్వరరావు తుటిపల్లి శ్రీనివాసరావు తూటిపల్లి వెంకట్రావు, గుడారి వెంకయ్య ఏసు పోగు నాగేశ్వరరావు, బంధం అనిల్ పట్టికొండ నవీన్,తాళ్లూరి పిచ్చయ్య, యానమద్ది అదెయ్య, గంగుల శ్రీను,మేడేపల్లి శ్రీనివాసరావు నంజలా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఏడాదికి రూ.12 వేలు

**సత్తుపల్లి - మహా:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాది కి రూ.12 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. శనివారం మండల పరిధిలోని రుద్రాక్షపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలను ఆమె కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.సీఎం రేవంత్ రెడ్డి భూమి లేని నిరు పేద ప్రజల కోసమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంను రూపొందించి ఏడాది కి రూ.12 వేలు అందజేయనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలను చేయతమే కాకుండా, మరెన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి



కార్యక్రమాలను అందిస్తుందన్నారు. రుద్రాక్షపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు బత్తుల భరత్ కుమార్, ఒగ్గు భూపతి రెడ్డి, హలవత్ అర్జున్, ధరవత్ కృష్ణ, గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

## కొత్త ఆశయాలతో ముందుకు సాగుదాం

## భాజపా నేత నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం - మహా:** తెలుగు సంవత్సరాది, మార్పుల్ని సాక్షిగా నిలిపే పవిత్ర పర్వదినం ఉగాదిని పురస్కరించుకుని, భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఖమ్మం జిల్లా ప్రజలకు, తెలుగు వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉగాది పండుగ తెలుగువారి జీవనశైలికి, సంస్కృతికి ప్రతిబింబం. కొత్త ఏడాది, కొత్త ఆశయాలతో, కొత్త విజయాలను అందించాలి. సుభిక్షత, ఆయురారోగ్యాలు అందరికీ లభించాలని మనసారా కోరుకుంటున్నాను" అన్నారు.

### భారతీయ సంస్కృతి మహోన్నతం

"ఉగాది పండుగ మన భారతీయ ధర్మాన్ని, సంప్రదాయాలను గొప్పగా చాటే పర్వదినం. పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్ ధోరణులను అవగతం చేసుకోవడం, చేదు-తీపి అనుభవాలను సమానంగా స్వీకరించడం వంటి విలువలను ఈ పండుగ మాకు నేర్పుతుంది. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా, న్యాయం-ధర్మబద్ధంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

### ఖమ్మం అభివృద్ధికి భాజపా కట్టుబాటు

నెల్లూరు కోటేశ్వరరావు ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అభివృద్ధిపై దృష్టి సారిస్తూ, "ప్రజా సంక్షేమం మా ధ్యేయం. భాజపా పాలనలో సమగ్ర అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యాలు. ఈ కొత్త సంవత్సరంలో ఖమ్మం జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగేందుకు మా పార్టీ అన్ని విధాలుగా కృషి చేస్తుంది" అని తెలిపారు.

### శుభం కార్యేషు సిద్ధిర్భవతు

ఈ ఉగాది సమృద్ధి, సుఖశాంతులతో ప్రతి కుటుంబానికీ ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, "తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. కొత్త సంవత్సరంలో అందరి ఆకాంక్షలు ఫలించాలని, దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అంటూ నెల్లూరు కోటేశ్వరరావు తన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ స్థంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో గోదాణా విరాళం

**ఖమ్మం సిటి - మహా:** ఖమ్మం నగరంలో శ్రీ స్థంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో ఫాల్గుణ బహుళ అమావాస్య సందర్భంగా గౌశాలలకు గో దాణా విరాళంగా అందజేయడం జరిగింది. నగరంలోని దాతలు, వ్యాపారస్తులు, గోభక్తులు, సేవా సమితి సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. మొత్తం రూ.70,000 విలువైన గో దాణా విరాళంలో, ఖమ్మం గొల్లగూడెం సమీపంలోని ఓం శ్రీకృష్ణ గోశాలకు రూ.56,000 విలువైన తవుడు, పెసర, కంది, బొబ్బర చున్నీ, గోధుమ పిండి, లాప్సీ, కూరగాయలు అందజేయగా,



టేకులపల్లి శ్రీ వెంకటేశ్వర గోశాలకు రూ.11,000 విలువైన ఐదు క్వింటాళ్ల తవుడు విరాళంగా ఇచ్చారు. అలాగే, కరిగిరి శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి గోశాలకు తవుడు బస్తాలను సమర్పించారు.

## మధిరలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

**మధిర మార్చి 29 మహా:** తెలుగువారి ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమం పునాదులపై తెలుగుదేశం పార్టీ అవిర్భవించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్ బాబు పేర్కొన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో మధిర పట్టణ టిడిపి బాధ్యులు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జెండా ఎగరవేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ, పాలకులు నిత్యం ప్రజలతోనే వుంటూ వారి సమస్యలను పరిష్కరించే ఒరవడికి శ్రీకారం చుట్టి తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా అనివార్యంగా ఈ పద్ధతిని అనుసరించేలా చేసింది తెలుగుదేశమేనని తెలిపారు. అభివృద్ధికి చిరునామా తెలుగుదేశమేనని, తెలంగాణ లో పూర్తి స్థాయిలో బలోపేతం చెందుతామని, పార్టీ మీద, నాయకుల మీద అవాకులు చెవాకులు పేలే వారికి తగిన గుణపాఠం చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు. మల్లాది హనుమంతరావు మాట్లాడుతూ మే నెలలో జరగబోయే మహానాడు తర్వాత తెలంగాణ లో స్పష్టమైన రాజకీయ కార్యాచరణ ప్రణాళికతో తెలుగుదేశం పార్టీ ప్రజల ముందుకు వస్తుందని, పార్టీకి చెందిన కేంద్ర మంత్రులతో రాష్ట్ర నాయకత్వం సమన్వయపరుకుని పార్టీని బలోపేతం చేసే దిశగా తమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఐటిడిపి మాజీ నాయకులు వేమూరి సునీల్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం మొదలు నేటి వరకు టిడిపి ఆరు పర్యాయాలు అధికారంలో వుందని, నాలుగు సార్లు ప్రతిపక్ష పాత్ర నిర్వహించిందని తెలుపుతూ, దశాబ్దాలుగా ప్రజలను యిబ్బంది పెడుతున్న, బూజు పట్టిన పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, అధికార వికేంద్రీకరణ లోభాగంగా మండల వ్యవస్థ ఏర్పాటు, స్థానిక సంస్థల లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు, మహిళలలకు ఆస్థి హక్కు తదితర సాహసోపేత సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు మార్నీడి పుల్లారావు, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, వంగాల రామకోటి, చావా శివాజి,



గద్దల ప్రకాశరావు,వాసిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ టిడిపి అధికారంలో వున్నప్పుడు జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంపై తెలుగుదేశం జండాను చేకూరి శేఖర్ బాబు ఎగురవేశారు. అనంతరం టిడిపి శ్రేణులు ర్యాలీ గా బయలుదేరి జిలుగుమాడు, క్లబ్ సెంటర్, అంబేద్కర్ సర్కిల్ లో వున్న నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాశం రామనాథం మేడా వెంకటేశ్వరరావు, వేల్పుల కొండ, యడవల్లి నాగభూషణం, వీరవల్లి కోటేశ్వరరావు, దేవభక్తుని వెంకట్, ములకలపల్లి వినయ్, ఇంటి చంద్రమౌళి, పోతినేని కోటేశ్వరరావు, గద్దలఏసోబు, బత్తినేని రామకృష్ణ, మాదాసు మల్లయ్య, ఈదర వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఈశ్వర్, గద్దల నరసింహారావు, చటారి ముసిలి, మహిళా విభాగం బాధ్యులు కోనేరు రాణి, అంగడాల గోపి, ఆశీర్వాదం, బోణాల ప్రసాద్, జమ్ముల కోటేశ్వరరావు, చేకూరి లీలాప్రసాద్, తెలుగు యువత బాధ్యులు యలమంచిలి శివ, వినుకొండ కృష్ణమూర్తి, చెన్నం స్వామి, నాగులంచ శ్రీనివాసరావు, రాజారెడ్డి, వీరమాచినేని అశోక్, గడ్డం మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు

## భోజన భద్రతకు నూతన ఊపిరి

**ఖమ్మం - మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత ఆరోగ్యకరమైన , పోషక విలువలతో కూడిన నాణ్యమైన సన్న బియ్యం అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభించనున్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఈ విషయమై అధికారిక ఉత్తర్వులను విడుదల చేశారు.ఈ పథకం కింద ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్డు దారులకు ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందించనున్నారు. ఎఫ్ ఏస్ సి ఆహార భద్రత కార్డుదారులకు ప్రతి వ్యక్తికి 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం కేటాయించబడుతుంది. మొత్తం 3,83,717 కార్డుదారులు లబ్ధి పొందనున్నారు. లబ్ధిదారుల సంఖ్య 10,70,243 కాగా, మొత్తం కేటాయింపు 64,21,458 కిలోలుగా ఉంటుంది. వినియోగదారులకు ఈ బియ్యం పూర్తిగా ఉచితంగా అందించబడుతుంది. ఎ ఎఫ్ ఎస్ సి అంత్యోదయ కార్డుదారులకు ప్రతి కార్డుదారునికి 35 కిలోల నాణ్యమైన సన్న బియ్యం కేటాయించబడుతుంది. లబ్ధిదారుల సంఖ్య 77,783 కాగా, మొత్తం కేటాయింపు 9,54,380 కిలోలుగా ఉంటుంది. ఈ బియ్యం కూడా ఉచితంగా అందించబడుతుంది. అన్నపూర్ణ కార్డుదారులకు ప్రతి కార్డుదారునికి 10 కిలోల నాణ్యమైన సన్న బియ్యం కేటాయించనున్నారు. అంత్యోదయ కార్డుదారులకు 1 కిలో చక్కెర కేటాయించబడుతుంది, దీని ధర రూ.13.50గా నిర్ణయించబడింది.

# ఇందిరమ్మ రాజ్యంలో... ప్రతిరోజూ పండగే!

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

### రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన

**ఖమ్మం - మహా:** తెలంగాణ ప్రజలకు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతిరోజూ పండగ రోజే అని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడిచిన 15 నెలల కాలంలో ఇందిరమ్మ ప్రభుత్వం చేసిన పాలనపై తెలంగాణ ప్రజలందరూ సంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కావాల్సిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతుందని తెలిపారు. మహిళల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు, రూ. 500కే గ్యాస్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు బంధుతో పాటు సన్నాలకు బోనస్ కల్పించిన ఘనత తమదేనన్నారు. ఇళ్లు లేని పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లను విడతల వారీగా మంజూరు చేస్తూ వస్తున్నామని దీనిపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువకుల ఉపాధి కోసం రాజీవ్ యువవికాస్ పేరుతో రూ. 50వేల నుంచి రూ.4లక్షల రుణం ఇచ్చే పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లోని సుమారు 5లక్షల మందికి పైగా యువతకు ఉ పాధి దొరుకుతుందని వెల్లడించారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న 'శ్రీ విశ్వావసు నామ' సంవత్సరంలోనూ ఇదే రకమైన పాలనను కొనసాగిస్తూ



తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దరిచేరుస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.li

## ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు



**ఖమ్మం - మహా:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉగాది పర్వదినం సందర్భంగా తెలుగు వారందరికి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు.శ్రీక్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరానికి హృదయపూర్వక స్వాగతం పలుకుతూ తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు, దేశవిదేశాలలో నివసిస్తున్నస్థిరపడిన తెలుగు వారందరికి ఎంపీ రవిచంద్ర శుభాకాంక్షలు చెప్పారు.చంద్రమాస పంచాగం ప్రకారం మొదటినెల చైత్రశుద్ధ పాడ్యమి నాడు వసంత రుతువు ప్రారంభాన ఉగాది పర్వదినాన్ని జరుపుకుంటామని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ రోజున షడ్రుచులు పులుపు,చేదు,తీపి,కారం, ఉప్పు,ఒగరుతో కూడిన పచ్చడిని సేవిస్తూ ఆస్వాదించి ఆనందిస్తామన్నారు.తెలుగు సంవత్సరం ఆరంభం రోజున ఆరు రుచులతో కూడిన పచ్చడిని సేవించడం ఆరోగ్యానికి ఒక వరం లాంటిదని ఎంపీ వద్దిరాజు చెప్పారు.ఈ పర్వదినాన కుటుంబ సభ్యులతో కలిసి భక్తిప్రపత్తులతో ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు,పంచాగ శ్రవణం,కవి సమ్మేళనాలలో పాల్గొనడం వల్ల శుభం కలుగుతుందన్నారు.శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో తెలుగు వారందరికి మరిన్ని శుభాలు కలుగాలని ఎంపీ వద్దిరాజు భగవంతున్ని ప్రార్థించారు.

## బాలల హక్కులు ప్రతి ఒక్కరు కాపాడాలి

**కూసుమంచి, మార్చి 29, మహా:** బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కూసుమంచి మండల ప్రత్యేకాధికారి శ్రీలత అన్నారు. శనివారం కూసుమంచి మండలం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో బాలల పరిరక్షణ విభాగము కౌన్సిలర్ డీ నిరోష ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ బాలల పరిరక్షణ కమిటీ పిల్లలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేవిధంగా బాధ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం కౌన్సిలర్ నిరోష మాట్లాడుతూ 0నుంచి 18 సంవత్సరాల వయస్సు పిల్లలందరికీ సంబంధించిన విషయాలు అనగా బడిబయట పిల్లలకు, బాలికలకు, బాలకార్మికులకు, బాల్యవివాహములకు, భిక్షాటన, అక్రమ దత్తత తదితర విషయాల గురించి తెలియజేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో కూడా ఈ కమిటీలు ఏర్పాటు చేసి పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఏసీడీపీవో ఉదయశ్రీ మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణకు ప్రతి గ్రామంలో అవగాహన



నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలలపై జరుగుతున్న అఘాయిత్యాలపట్ల ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ బాధ్యులను చట్టానికి అప్పజెప్పి, బాలలకు న్యాయం జరిగేవిధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీలత, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ కరుణ శ్రీ, ఎస్సై నాగరాజు, సీడీపీవో ఉదయశ్రీ, మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి, మండల మెడికల్ ఆఫీసర్ కిషోర్ కుమార్, ఎంపీవో రాంచందర్ రావు, ఏపీఎం తిరుమలరావు, కౌన్సిలర్ నిరోష, బాల, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ ఏర్పాటుకు ఎంఎల్ఏ హామీ

**జూలూరుపాడు - మహా:** జూలూరుపాడు లో శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు చేయాలనీ పనులను వెంటనే ప్రారంభించలని కోరుతూ జూలూరుపాడు రైతు ప్రజాసంఘాల గిరిజన సంగంజేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శాసన సభ్యులు రాందాస్ నాయక్ కు వైరా లోని తన గృహంలో వినతి పత్రం అందిచడం జరిగింది . అదేవిదంగా ఐ టి డి ఏ ఏ పి ఓ డేవిడ్ రాజ్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఈ మండలం లో అత్యధికముగా పత్తి పంటను సాగుచేస్తున్నారు అని అన్నారు దూర ప్రాంతాలకు వెళ్లి అమ్మాలి అంటే కొంత వ్యయ ప్రయాసలతో, ఖర్చు లతో కూడుకున్నాదని సమయం కూడా వేచించాల్సిన పరిస్థితి ఉన్నదని దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు కాబట్టి అన్ని విధాలుగా రైతులకు ఉపయోగం గా అందుబాటులో ఉన్నటువంటి మార్కెట్ గా ఉన్నదని అన్నారు ఇక్కడికి వివిధ రాష్ట్రము లనుండి పత్తి కొనుగోలు చేయడం కోసం వ్యాపార వేత్తలు రావడంతో రైతులకు కూడా మేలు జరుగుతుంది అని వివరించటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో జేఏసీ నాయకులు భానోత్ ధర్మ, గుగులోత్ కేశవ నాయక్, లకావత్ నాగేశ్వరావు, జాటోత్ కృష్ణ భానోత్ మధు, భూక్యా శివ, భూక్యా శంకర్, హమాలీ మేస్త్రి లు గత్తం బాబురావు పప్పు ల, జానూ, ఇల్లంగి సుందర్ రావు, పోతురాజు బోడయ్య, నరసింహారావు, వల్ల మల్ల చంద్రయ్య, ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు లేళ్ళ వెంకట్ రెడ్డి, రామిశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు



## అత్యధిక బొగ్గు రవాణా చేసిన కొత్తగూడెం ఏరియా



**భద్రాద్రి కొత్తగూడెం - మహా:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో శుక్రవారం రోజుకు 80,931 టన్నుల బొగ్గు రవాణా చేసి సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా బొగ్గు రవాణా చేసిన ఏరియాగా రికార్డు నెలకొల్పింది. ఇందులో రైలు మార్గం ద్వారా 17 ర్యాకులు (జే.వి.ఆర్.సి హెచ్.పి - 12 ర్యాకులు మరియు ఆర్.సి హెచ్.పి - 05 రేకులు ) బొగ్గు రవాణా చేసి రైలు మార్గం ద్వారా 67,853 టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 13,078 టన్నులు మొత్తంగా 80,931 టన్నుల బొగ్గు రవాణా చేసింది. గత ఏడాది మార్చి 30 న 69,719 టన్నుల బొగ్గు రవాణాను రైలు మార్గం ద్వారా 15 ర్యాకులు (జే.వి.ఆర్.సి హెచ్.పి - 12 ర్యాకులు మరియు ఆర్.సి హెచ్.పి %-% 03 రేకులు ) చేసి 60,059 టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 9,660 టన్నులు మొత్తంగా 69,719 టన్నుల బొగ్గు రవాణా చేసి సృష్టించిన రికార్డును, ఇప్పటి వరకు మొత్తం సింగరేణిలో ఏ ఏరియాకు సాధించని ఘనత కొత్తగూడెం ఏరియాకు దక్కింది. కొత్తగూడెం ఏరియా ఈ అరుదైన రికార్డును (80,931 టన్నుల బొగ్గు రవాణా ) సాదించడం ద్వారా తాను సృష్టించిన రికార్డును తానే అధిగమించి, రక్షణతో కూడిన ఈ సరికొత్త రికార్డును నెలకొల్పడం చాలా ఆనందదాయకంగా ఉందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు శనివారం తెలిపారు .



# ఖమ్మం అభివృద్ధికి కొత్త దారులు

- భద్రాచలానికి నూతన రంగులద్దుతున్న ప్రభుత్వం
- రైతు సంక్షేమానికి మరింత బలమైన అడుగులు
- ఖమ్మం రింగ్ రోడ్ - ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- భద్రాద్రి ఆలయ అభివృద్ధికి కీలక నిధుల కేటాయింపు
- ఉగాది నాడు ఖమ్మం అభివృద్ధికి పలు శుభవార్తలు
- ఖమ్మం జిల్లాలో వివిధ అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల

### విమానాశ్రయం ఏర్పాటుకు కృషి

కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా మని అన్నారు. పాండురంగాపురం నుంచి విష్ణుపురం రైల్వే లైన్ మంజూరు కావడం జరిగిందని, ఇందులో భాగంగా పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వే లైన్ వేస్తే భద్రాచలంకు రైల్వే కనెక్టివిటి వస్తుందని అన్నారు.

**ఖమ్మం - మహా:** ఖమ్మం జిల్లా అభివృద్ధికి కీలకమైన పలు నిర్ణయాలు, ప్రాజెక్టులు, పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ముఖ్యంగా, ఆయిల్ పామ్ రైతులకు బలమైన మద్దతుగా ఖమ్మం జిల్లాలో కొత్త ఫ్యాక్టరీ శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. అలాగే, భద్రాద్రి ఆలయ అభివృద్ధికి 34 కోట్ల నిధులు మంజూరు చేయడం, ఖమ్మం రింగ్ రోడ్ రూపకల్పన, జాతీయ రహదారుల నిర్మాణానికి పురోగతి, కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయానికి అనుమతి వంటి కీలక అంశాలు ఖమ్మం జిల్లా భవిష్యత్తును మరింత వెలుగులు నింపనున్నాయి. రైతులకు ఉగాది శుభవార్తగా సన్న బియ్యం పంపిణీ నిర్ణయం, సాగునీటి ప్రాజెక్టుల వేగవంతమైన అమలు వంటి అంశాలు కూడా మంత్రి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో అభివృద్ధి నూతన అధ్యాయాన్ని ప్రారంభించిన ఈ నిర్ణయాలు భవిష్యత్తులో జిల్లాకు మరిన్ని అవకాశాలు తీసుకురావడం ఖాయం. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ప్రజలకు, పాత్రికేయులకు, రైతాంగ సోదరులకు తెలుగు నూతన నామ సంవత్సర ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖమ్మం జిల్లా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రధాన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం క్రింద 600 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేసి 101 కిమి కాల్వలో నీరు తీసుకొని వచ్చామని, ఆరు నెలల వ్యవధి కాలంలో 1500 క్యూసెక్కుల పరిమాణంతో రాజీవ్ కెనాల్ 9 కిలోమీటర్ల మేరకు పూర్తి చేసి సాగర్ కాల్వకు లింక్ చేసి, మొన్న సాగునీరు ఇబ్బందులు వచ్చినప్పుడు వైరా, తల్లాడ, పెనుబల్లి వెంసూర్ మండలాలతో పాటు ఎగువన పినపాక, కొత్తగూడెం, అశ్వరావుపేట నియోజకవర్గాల్లోని పంటలు కూడా కాపాడుకోవడం జరిగిందని అన్నారు. కాల్వల నిర్మాణ పనుల సవరణ అంచనాలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, దీని ద్వారా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల్లో సుమారు లక్షా 20 వేల ఎకరాలు, సాగర్ క్రింద లక్షా 20 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, సత్తుపల్లి నియోజకవర్గంలో సుమారు 80 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. భద్రాద్రి దేవాలయ అభివృద్ధికి టెంపుల్ చుట్టూ భూ సేకరణ చేయాల్సిన అవసరం ఉందని, ఆగమ శాస్త్రం ప్రకారం పండితులు చెప్పినట్లు అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డిఓ నరసింహారావు, నేషనల్ హై వే మేనేజర్ దివ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం

- జర్నలిస్టుల చిరకాల వాంఛ నెరవేరుస్తా
- 10ఎకరాల 18గుంటలకు రక్షణ కల్పిస్తా
- రిపోర్టర్ల ఐక్యత చూస్తుంటే నా జర్నలిస్టు రోజులు గుర్తుకు వస్తున్నాయి
- దీక్ష శిబిరాన్ని సందర్శించి ,దీక్షను విరమిపజేసిన ఎంఎల్ఏ కూనంనేని

**కొత్తగూడెం - మహా:** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా వుంటానని, వారి చిరకాల వాంఛ ఇంటి స్థలం ఇప్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానని కొత్తగూడెం నియోజకవర్గ ఎంఎల్ఏ కూనంనేని సాంభశివరావు అన్నారు. శనివారం గంగా బిసన్ బస్తీలో గత పది రోజులుగా చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉద్యమాలకు తాను వ్యతిరేకం కాదు అని, ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేసారు. జర్నలిస్టు చేస్తున్న దీక్ష ఐక్యతను తీసుకు వచ్చిందని , ప్రభుత్వం జర్నలిస్టు లకు ఇవ్వాలని అనుకున్న 10ఎకరాల 18గుంటల భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేయించి బోర్డు పెట్టించే పని చేపడతానని, ఆ తర్వాత భూమి జర్నలిస్టు లకు ఎలా పంపిణి చేయాలనే అంశం పై కలెక్టర్ , యూనియన్ లకు అతీతంగా కూర్చొని మాట్లాడి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అనంతరం జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులతో మాట్లాడుతూ మీలోని ఐక్యత , ఇలా అందరూ ఒకదగ్గర చేరడం చూస్తుంటే తనకు నా జర్నలిస్టు గా పని చేసిన రోజులు గుర్తుకు వస్తున్నాయని చెప్పి గత స్మృతులను పంచుకున్నారు. ఆ రోజుల్లో ఐదారుగురు మాత్రమే వుండేవాల్లమని సమాజం , ప్రజల సమస్యల పై ఎప్పుడు చర్చించే వారమని తెలిపారు. ఇలాగే ఐక్యత కొనసాగాలని, భవిష్యత్ లో మీ అందరికీ ఇంటి స్థలం ఇచ్చి మీ కోరిక నెరవేర్చుతనని జర్నలిస్టులకు మరోసారి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా, సీనియర్ పాత్రికేయులు జనుమాల రమేష్,టివి నాగాచారి,కల్లోజి శ్రీనివాస్, డీవీ, రవీందర్, రవి, తారక్, వీరు, దుర్గ పాల్గొన్నారు.

# నేటినుండి భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**మహా భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నేటినుండి అనగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది నుండి శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. మార్చి 30 నుండి ఏప్రిల్ 12 వరకూ ఈ బ్రహ్మోత్సవాలు జరగనుండగా, ఏప్రిల్ 6 శ్రీరామ నవమి నాడు శ్రీసీతారాముల కళ్యాణం, 7 న స్వామి వారికి మహా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించేందుకు, లక్ష మందికి పైగా భక్తులు భద్రాద్రికి తరలి వస్తారని రెండున్నర కోట్ల రూపాయలతో ఏర్పాట్లు చేస్తున్నారు.ఆలయ పరిసరాలను చాందిని వస్త్రాలతో, రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిల్లు నిర్మించి, ప్రధాన దారులవద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. భక్తులకు స్వామి వారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రసాదం కొరత లేకుండా 19 కౌంటర్లు ద్వారా ప్రసాదం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.



## కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో

# పాల్వంచ మనుగడకి ఇబ్బంది ఉండదు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు
- కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పరుగులు తీస్తుంది
- మునుపెన్నడు జరగని రీతిలో కొత్తగూడెం అభివృద్ధి చెందుతుంది
- విద్యా, వైద్య, వ్యవసాయం, టూరిజం తదితర అన్ని అంశాల అభివృద్ధిపై దృష్టి సారించాం

**భద్రాద్రి కొత్తగూడెం - మహా:** కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మనుగడకి ఇబ్బంది ఉండదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం కొత్తగూడెం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు అభివృద్ధి విషయాలపై ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కూనంనేని మాట్లాడుతూ,కొత్తగూడెం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వలన కూడా కొత్తగూడెం ప్రాంతం మరింతగా అభివృధి జరుగుతుందని, నియోజకవర్గంలో రోడ్, డ్రైన్ లేని గల్లి ఉండదని కూనంనేని తెలిపారు. 50కోట్లతో అమృత పాల్వంచగా శరవేగంగా పాల్వంచ ప్రాంతం అభివృద్ధి చందన ఉన్నదని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎద్యుకేషన్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కేంద్రీయ విద్యాలయం సింగరేణి మోడల్ స్కూల్, సింగరేణి మహిళా కళాశాలలో ఎంబీఏ, బి బి ఏ, బి సి ఎ కోర్సులు రానున్నాయని,ప్రభుత్వ ఐటిఐ మరియు పాలిటెక్నిక్ ఆధునీకరణ పనులు జరగనున్నాయని, 3.90 కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణం కానున్నదని, 4 కోట్ల రూపాయలతో పాల్వంచ డిగ్రీ కళాశాల, 4 కోట్ల రూపాయల నిధులతో కొత్తగూడెం డిగ్రీ కళాశాల ఆధునికీకరణ పనులు జరగనున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు.కార్పొరేషన్ లో విలీనమైన సుజాతనగర్కు జూనియర్ కళాశాల మంజూరు అయిందని, కొత్తగూడెంలో 100 కోట్ల రూపాయల నిధులతోఎర్త్ యూనివర్సిటీ రానున్నదని కూనంనేని తెలిపారు.ఇక వైద్యం విషయానికొస్తే , కొత్తగూడెంలో నూతన హంగులతో డయాలసిస్ కేంద్రం ప్రారంభమై, కిడ్నీ రోగులకు సేవలు అందిస్తోందని, పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవనం ఏర్పాటు కానున్నదని, ఏజెన్సీ ప్రాంత వాసులకు, అందని ద్రాక్షగా ఉన్న, కార్పొరేట్ స్థాయి వైద్యం అయిన ఎమ్మారై సిటి స్కాన్ లాంటి సదుపాయాలు కొత్తగూడెంలో అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే కోణం లేని తెలిపారు. ఇక ఇరిగేషన్ విషయానికి వస్తే, కొత్తగూడెం నియోజకవర్గం లో ప్రతి ఎకరానికి నీరు అందించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కూనంనేని తెలిపారు.కొత్తగూడెం నియోజకవర్గం సహజ సిద్ధంగా అటవీ ప్రాంతం కలిగి ఉన్నందున జూ పార్కు కోసం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు. దశాబ్దాల కలగా మిగిలిపోయిన కొత్తగూడెం ఎయిర్పోర్ట్ తప్పకుండా ఏర్పాటు అవుతుందని, రెండవ పర్యాయం కూడా సర్వే జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కూనంనేని తెలిపారు.

## విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

**మహా భద్రాచలం:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శనివారం భద్రాచలం లోని స్పెషల్ సబ్ జైలు ను సందర్శించారు. ఈ సందర్భంగ విచారణ ఖైదీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, క్షణికావేశం లో చేసిన నేరాలతో ఖైదీలుగా మారి జైలు జీవితం గడపాల్సి వస్తుందని తద్వారా తమ విలువైన భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. విచారణ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదులకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు.



జైలు పరిసరాలు, ఖైదీలకు వడ్డించే ఆహారం, సదుపాయాలు,ఆరోగ్య పరిస్థితిల గురించి విచారించారు. ఖైదీలలో మార్పుకు కృషి చేయాలని సూచించారు.

## దుకాణ యజమానులకు న్యాయం చేస్తాం

**మహా భద్రాచలం:** రామాలయం అభివృద్ధిలో భాగంగా నష్టపోతున్న దుకాణ యజమానులను అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హామీ ఇచ్చారు. శనివారం దుకాణ సముదాయాలను ఆయన ఆర్ డి ఓ దామోదర్ తో కలిసి పరిశీలించారు. దుకాణ యజమానులకు తగిన న్యాయం చేసిన తర్వాతే తొలిగించడం జరుగుతుందని, ఎవరు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఎమ్మెల్యే వెంట బుడగం శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్ గౌడ్, బోగాల శ్రీనివాసరెడ్డి, వెంకట్ రెడ్డి, సరెళ్ల నరేష్ తదితరులు ఉన్నారు.



## జీళ్ళచెరువులో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీవో..



**కూసుమంచి, మార్చి 28, మహా:** కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కూసుమంచి మండల పంచాయతీ అధికారి రామచంద్రయ్య ప్రారంభించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ముజ్మమిలఖాన్ ఆదేశించారు. దీంతో జీళ్ళచెరువు పంచాయతీ లో గ్రామ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీవో రామచంద్రయ్య ప్రారంభించారు.

## చత్తీస్గడ్‌లో భారీ ఎన్కౌంటర్

**మహా భద్రాచలం:** చతిస్గడ్ సుక్మా జిల్లా గోగుండా కొండపై ఉపంపల్లి ప్రాంతంలో శనివారం ఉదయం మావోయిస్టులకు భద్రతా బలగాలకు జరిగిన ఎదురు కాల్పులలో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్కౌంటర్ మృతులలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జగదీశ్ ఉన్నట్లు చతిస్గడ్ ఉప ముఖ్యమంత్రి విజయ వర్మ వెల్లడించారు. జగదీశ్ తలపై రు. 25 లక్షల రివార్డ్ ఉంది. ఇతను 2013 లో 30 మంది కాంగ్రెస్ నాయకులను హత్య చేసిన కేసులో, 2023 లో పేలుడు ద్వారా 10 మంది జవాన్ లను చంపిన కేసులో ప్రధాన సూత్రదారి.ఈ ఆపరేషన్లో డి ఆర్ జి, సి ఆర్ పి ఎఫ్ జవాన్ లు పాల్గొన్నారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో దేశం బలోపేతం

**మధిర మార్చి 29 మహా:** దేశవ్యాప్తంగా ఏకకాలిక ఎన్నికల సంస్కరణల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మధిర బీజేపీ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్ అధ్యక్షన జరిగిన మధిర మండల, టౌన్ కార్యశాలకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంపద దుర్వినియోగం కాకుండ, అధికారుల సమయం వృధాకాకుండ మరియు దేశ ఆర్ధికంగా బలపడటం, పరిపాలన పై ద్రుష్టి, వంటి ఇంకా అనేక విధాలుగా భావితరాల భవిష్యత్ కోసం వన్ నేషన్ వన్ ఎలక్షన్ ద్వారా సాధ్యం అవుతుంది అని అన్నారు.

## ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీస్ అధికారులకు సన్మానం



**ఖమ్మం - మహా:** ఈ నెల 31 న ఉద్యోగ విరమణ పొందుతున్న తొమ్మిది మంది పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

## ముస్లిం మత పెద్దలను సన్మానించిన తల్లాడ ముస్లిం కమిటీ

**తల్లాడ - మహా:** తల్లాడలో మసీద్ పక్కన తరాబీ పూర్తయిన సందర్భంగా ముస్లిం సోదరులు శుక్రవారం ముస్లిం మత పెద్దలను, ఖురాన్ ను పఠనం చేసిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు అనాత్ మౌలానా, ముజీద్ మౌలి షాబ్ లను శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా సుమారు నెలరోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, తరాబి పూర్తయిన సందర్భంగా సన్మానించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ ఈసూబ్, సదర్ షేక్ మస్తాన్, నాయర్ సదర్ షేక్ మెహరాజ్, అక్బర్, మున్నా, నిజాం, బడే మియా, జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

